క్లుప్తంగా

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి



మాట్లాడుతున్న భవానీశంకర్

మెళియాపుట్టి: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి భవానీశంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు, కార్యదర్శులతో సమీక్షించారు. ప్రజలు వారి అవసరాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే జగన్ననకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో చంద్రకుమారి ఉన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు పంపిణీ

కొత్తూరు: కర్లెమ్మ గ్రామ సచివాలయం పరిధిలోని కౌలు రైతులు జేఎల్‌జీ సంఘాలుగా ఏర్పడ్డారు. కౌలు రౌతులకు కూడా పంట రుణాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదేశాల మేరకు కర్లెమ్మకు చెందిన జేఎల్‌జీ కౌలు రైతు సంఘానికి స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజశేఖర్ మూడు లక్షల రూపాయల పంట రుణాలను మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్కును సంఘం సభ్యులు పెద్దకోట జగన్నాథంతో పాటు ఇతర సభ్యులకు ఏవో శ్రీనివాసరావు, మేనేజర్ల చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకరాలు కల్యాణలక్ష్మి ఉన్నారు.

భూముల రీసర్వేకు సహకరించాలి

సారవకోట: భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ హనుమంతరావు కోరారు. చిన్నగుజ్జువాడ, అర్లి గ్రామాల్లో భూ రికార్డుల శుద్ధికరణపై శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఆయా గ్రామాల్లో డ్రోన్ సర్వే అయ్యిందని.. ఆ ప్రాప్తికి వచ్చిన ఇమేజ్‌ల ప్రకారం సర్వే చేస్తారన్నారు. దానికి రైతులు తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలతో హాజరై సహకరించాలని సూచించారు. సర్వేయర్ రామకృష్ణ, సర్పంచ్ బాబూరావు, వైస్ ఎంపీపీ ఎడ్ల అసిరయ్య ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గోపి

జలుమూరు: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి గ్రామపంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేవిధంగా పారదర్శకతతో పనిచేయాలన్నారు. వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, మండల సలహాదారు పైడి విఠలరావు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మథరావు ఉన్నారు.

'ఆ ఓట్లను తొలగించాలి'



మాట్లాడుతున్న రామారావు

సరుబుజ్జిలి: పెద్దసవళాపురం గ్రామంలో తప్పుడు విధానంలో నమోదు చేసిన ఓట్లను తక్షణమే తొలగించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏఎంసీ మజీ చైర్మన్ బద్రి రామారావు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పెద్దసవళాపురంలో ఓటు కలిగినవారు ఇతర ప్రాంతాల్లో ఆధార్ చిరునామా మార్పు చేసి కొత్తగా ఓటర్లుగా నమోదవుతున్నారని ఆరోపించారు. అలాగే పెళ్లయినవారు, చనిపోయినవారు కలిపి 60 మంది ఉన్నప్పటికీ వారి ఓట్ల తొలగింపులో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు అదపాక గౌరినాయుడు, సూర్యప్రకాశరావు, కొవిలాపు గౌరినాయుడు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో లక్ష దీపార్చన



పూజల్లో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట: స్థానిక సిద్ధాశ్రమంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో లక్ష దీపార్చన పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణతో పాటు పులువురు మహిళలు పాల్గొన్నారు. కార్తీక మాసం సందర్భంగా సిద్ధాశ్రమంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహిళలు దీపారాధన చేట్టారు.

సీఎం జగన్‌తోనే భావితరాలకు ఉజ్వల భవిష్యత్



మూలసవలాపురంలో సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- మూలసవలాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మూలసవలాపురంలో కుళాయిల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని

సరుబుజ్జిలి: భావితరాల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా బాసటగా నిలవాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. మూలసవలాపురం, తురకపేట, వ్యాసులపేట, తురకపేట కాలనీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. రహదారులు, మురుగు కాలువలు నిర్మాణం కోసం స్థానికులు వినతిపత్రాలు అందించగా.. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, పున్నపురెడ్డి తవిటినాయుడు, సిరిపల్లి శ్రీనివాసరావు, గదిలి రమణమూర్తి, బద్రి రామారావు, బెండి శ్యామలరావు, గదిలి మురళి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటి సరఫరా

సరుబుజ్జిలి: ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. మూలసవలాపురం, తురకపేట, వ్యాసులపేట గ్రామాల్లో జలజీవన్‌మిషన్ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికీ మంచినీటి కుళాయిలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో నీటి కోసం మహిళలు పడుతున్న కష్టాలను స్వయంగా చూసి చలించిపోయారన్నారు. దీంతో నీటి కోసం బాధలు పడకుండా వనరులను సమకూర్చుతున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ గడపకు మంచినీటిని అందించే వరకు విశ్రమించేది లేదని స్పీకర్ స్పష్టం చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే రెడ్డిశాంతి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. చొర్లంగిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనంతో పాటు రైతుభరోసా కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహాత్ముడు కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని చెప్పారు. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు సుపరిపాలనతో పాటు పౌరసేవలు సక్రమంగా అందుతున్నాయన్నారు. ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా నిలుస్తున్నారన్నారు. రైతును రాజు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకున్నవారు తప్పకుండా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం జగ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, వైస్ ఎంపీపీ వంగపల్లి సావిత్రి, సర్పంచ్‌లు డి.లక్ష్మి, వి.జ్యోతి, సచివాలయ కన్వీనర్ టి.మురళీ, నాయకులు వి.నర్సింహమూర్తి, వి.చిన్నారావు, రెడ్డి జగదీశ్ పాల్గొన్నారు.

మండల బడ్జెట్ ఆమోదం

జలుమూరు: జలుమూరు మండల బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.21,66,000 కాగా 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌గా 24,84,000 రూపాయలుగా ఏకగ్రీవంగా తీర్మానించారు. అభివృద్ధి పనులు, మంచినీరు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, కార్యాలయం పరిపాలన తదితర వాటికి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, మండల సలహాదారు పైడి విఠలరావు, పంచాయతీ విస్తరణాధికారి ఉమామహేశ్వరరావు ఉన్నారు.

చాపర జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థికి డాక్టరేట్ ప్రదానం



కళాశాల ప్రతినిధుల నుంచి డాక్టరేట్ అందుకుంటున్న జీవనరావు

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు-సీ పంచాయతీ పరిధి బంజీరు గ్రామానికి చెందిన హనుమంతు జీవనరావు డాక్టరేట్ సాధించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడా అమిటీ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్నారు. ఇతను 2005లో చాపర జిల్లాపరిషత్ పాఠశాలలో పదో తరగతి చదివాడు. అమిటీ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో సింథసిస్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ న్యాచురల్ ఫైబర్- నానో కాంపోసిట్ మెటీరియల్ ఫర్ ఎన్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్యానెల్స్ అనే అంశంపై 2018 నుంచి 2023 వరకు చేసిన పరిశోధనలకు డాక్టరేట్ దక్కింది. జీవనరావు ప్రస్తుతం అదే విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడికి డాక్టరేట్ రావడంతో తల్లిదండ్రులు సాంబయ్య, సంజీవమ్మలతో పాటు స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ఏవీ సురేష్

హిరమండలం: వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని మండల వినియోగదారుల సంఘ అధ్యక్షుడు ఏవీ సురేష్ అన్నారు. స్థానిక రామేశ్వరి డిగ్రీ కాలేజీలో రాష్ట్ర వినియోగదారుల హక్కుల కమిషన్ పిలుపు మేరకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వస్తువుల క్రయ, విక్రయాల్లో అవగాహన తప్పనిసరి అన్నారు. కాలేజీ కరస్పాండెంట్ రెడ్డి గోపాలరావు మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల రక్షణకు చట్టాలు ఉన్నాయని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో సురేష్, గణపతిరావు, కుమారస్వామి, సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జయంత్ ప్రసాద్

పాతపట్నం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో పి.జయంత్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం సచివాలయ సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు రిఫ్రెష్ రెండవ రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, అరుణ్ కుమార్, శిక్షకులు పాల్గొన్నారు.

కొత్త రైల్వేగేటు ఏర్పాటుతో ట్రాఫిక్ జామ్



రైల్వే గేటు వద్ద వాహనదారుల ఇబ్బందులు

పాతపట్నం: పాతపట్నం రైల్వేస్టేషన్ వద్ద జాతీయ రహదారిపై ఉన్న రైల్వేగేటు వద్ద పక్కనే మరోగేటు, సిగ్నల్ లైట్ ఏర్పాటు కోసం పనులు శుక్రవారం చేపట్టారు. దీంతో పత్రి రెండు గంటలకు 20 నిమిషాల చొప్పున వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయం నుంచి పాత గేటును తొలగించి కొత్తదాన్ని ఏర్పాటు చేశారు. కాగా కొత్త గేటు ద్వారా వాహనాలను శనివారం ఉదయం నుంచి పంపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గేటు వద్ద సిగ్నల్ లైట్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

మెళియాపుట్టి: దివ్యాంగు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందేలా ఉపాధ్యాయులు చూడాలని మండల విద్యాశాఖ అధికారులు దేవేంద్రరావు, పద్మనాభరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులకు బహుమతులను శుక్రవారం ప్రదానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. మేనరికం, అయోడిన్, పలు పోషకాల లోపంతో దివ్యాంగులుగా పిల్లలు పుడతారన్నారు. ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రినాథరావు, ఫిజియో థెరపిస్ట్ ఈశ్వరరావు, మహిళాపోలీస్ భారతి, ఉపాధ్యాయులు ఝాన్సీ ఉన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం



గాయత్రికి ఆటో పత్రాలను అందజేస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాహిళా సాధికారతే లక్ష్యంగా మహిళలకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్టు కట్యాచార్యులపేట సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అన్నారు. మహిళా శక్తి ద్వారా గ్రామానికి చెందిన మన్నేన గాయత్రికి సెర్ప్ ఆధ్వర్యంలో మంజూరు చేసిన ఆటోను, పత్రాలను శుక్రవారం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీసీ చంద్రరావు, రమణ ఉన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



జలుమూరు: నగిరికటకంలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. నిరంతరం ప్రజల కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు.



పొందూరు: తాడివలసలో బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: కడుములో సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆమదాలవలస రూరల్: చీమలవలసలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు



సారవకోట: బుడితిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నరసన్నపేటలోని సచివాలయం-4 పరిధిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

సంక్షిప్తంగా..

భగత్‌సింగ్ ట్రస్టు ఔదార్యం



సాయమ్మకు సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తూరు: ఆపదలో ఉన్నవారికి కుంటుభద్ర గ్రామానికి చెందిన భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు అండగా నిలిచారు. హిరమండలం మండలం శుభలయ గ్రామానికి చెందిన కొంచాడ రమణయ్య భార్య సాయమ్మకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. దీంతో ఆమె వైద్యం నిమిత్తం ట్రస్టు సభ్యులు రూ. పది వేలు అందజేశారు. అలాగే రణస్థలం మండలం రావాడ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు చెందిన వారి ఇళ్లు కాలిపోయాయి. దీంతో అరు కుటుంబాలకు మూడు నెలలకు సరిపపే నిత్యావసర సరుకులు, రూ. పది వేలు అందజేసినట్లు ట్రస్టు చైర్మన్ నడిమింటి జగదీశ్వరరావు తెలిపారు.

నేడు పొందూరులో స్పీకర్ పర్యటన

పొందూరు: స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

నేడు కొత్తూరు మండల సమావేశం

కొత్తూరు: కొత్తూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుంది. ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవోఎంపీడీవో పావని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

విద్యుత్ లైన్‌మెన్ మృతికి సంతాపం



గాలాల రమణ (ఫైల్)

ఎల్.ఎన్.పేట: రావిచెంద్రి గ్రామానికి చెందిన గాలాల రమణ (53) సంతకవిటి మండలంలో విద్యుత్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నారు. ఈయన గురువారం రాత్రి గుండెపోటుకు గురికావటంతో కుటుంబ సభ్యులు రాజాంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రమణ మృతితో రావిచెంద్రి గ్రామంలో విషాదం అలముకుంది. ఈయన మృతిపై విద్యుత్ శాఖ సిబ్బంది సంతాపం తెలియజేశారు.

1.5 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

పాతపట్నం: మండలంలో జీసీసీ ఆధ్వర్యంలో ఆర్‌బీకేల ద్వారా రైతుల వద్ద నుంచి 1.5 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఏవో శారద తెలిపారు. పెద్దసీది గ్రామంలో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఆర్‌బీకే సిబ్బంది శుక్రవారం పరిశీలించారు.

మెనూ అమలు చేయాలి

హిరమండలం: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈవో రాంబాబు సూచించారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం పరిశీలించారు. మెనూను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎంఈవో-2 షణ్ముఖరావు, హెచ్‌ఎం కేశవరావు ఉన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ చూపాలి

హిరమండలం: ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ చూపాలని ఎంఈవోలు కె.రాంబాబు, టి.షణ్ముఖరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దివ్యాంగ పిల్లలకు రాయడం, చదవడంతో పాటు మానసిక పరిజ్ఞానం పెంపొందించేలా చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కేశవరావు, డాక్టర్ శాంతి, ధనుంజయరావు ఉన్నారు.

దోమతెరలు పంపిణీ

కొత్తూరు: కాకరగూడ, చోలిపి గ్రామాలకు చెందిన గిరిజనులకు సింగపూర్ రెడ్‌క్రాస్ సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు దోమతెరలను పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ జిల్లా శాఖ సభ్యులు చిన్నయరావు ఆధ్వర్యంలో పంపిణీ ప్రక్రియ శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కొత్తూరు శాఖ ప్రతినిధి పాగిరి రవి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం

సారవకోట: అవలింగిలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాస ఏకాదశిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు జరిగాయి.

తక్షణ సాయం అందజేత



తక్షణ సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: కష్టాల్లో కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఆదుకుంటుందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మేజరు పంచాయతీ పరిధి వజ్రంపేటకు చెందిన ముద్దాడ వెంకటరమణ అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన వైఎస్సార్ బీమా పాలసీదారు. దీంతో నామినీగా ఉన్న అతని తల్లి సరస్వతికి తక్షణసాయంగా రూ. 10 వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆమెకు శుక్రవారం అందజేశారు. మిగిలిన రూ. 90 వేలు బ్యాంకు ఖాతాలో నెల రోజుల్లో జమవుతోందని ఎమ్మెల్యే చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దాలినాయుడు, సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ కృష్ణబాబు, ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్ పాల్గొన్నారు.